# గుర్తింపు





"ఇదే సుమతీ! మన అద్దెఇల్లు!" చూపించాడు ఆనంద్. సుమతి పరీక్షగా చూసింది. అది ఒక పెంకుటిల్లు. ఇంటి ముందు చిన్నహాలు – లోపల వైపు రెండు గదులు. ఒక వంటిల్లు. పెరట్లో బాత్ రూమ్, లెట్రిన్, బావి.

"సుమతీ! నీవు ఆశించినట్లుగా లేదుకదూ? నీకు నచ్చలేదనుకుంటాను."

"లేదండీ! నాకు చాలానచ్చింది. ఇంతకంటే మంచిఇల్లు ఈ వూళ్ళో ఎక్కడ దొరుకుతుంది?"

"అదికాదు సుమతీ! ఇది నేల! ఎప్పటి కప్పుడు అలుక్కోవాలి! నీకు అలవాటు లేనిపని" చిన్నగా అన్నాడు ఆనంద్.

"ఓస్–అంతేగా! చక్కగా అలికి ముగ్గులు పెట్టొచ్చు! ఎంచక్కగా వుంటుందో!" ఆనందంగా అన్నది సుమతి.

ఆనంద్ తృప్తిగా భార్యవైపు చూశాడు. ఇంతలో ఎవరో పిలిస్తే బైటికి వెళ్ళిపోయాడు.

ముక్తవరం రేణుకారాణి

సుమతి ఇల్లంతా కలియతిరిగి ఏ వస్తువు ఎక్కడ పెట్టాలో నిర్ణయించుకొని చకచకా సర్దేసి ఓసారి తృప్తిగా చూసుకొని బైటికి వచ్చింది. ఇంటి ముందు చాలా స్థలముంది. చక్కగా తోట వేసుకోవచ్చు. ఆ తోటలో కూచుని ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూస్తుంటే ఎంత బావుంటుంది. ఊహా లోకంలో తేలిపోతున్న సుమతి "శభాష్! సుమా! ఇల్లంతా చక్కగా సర్దేశావే!" అన్న ఆనంద్ మాటలకు ఈ లోకంలోకి వచ్చింది.

*

ఆనంద్ సుమతిని ఏరికోరి పెళ్ళి చేసుకున్నాడు. ఎప్పుడో చిన్నప్పటి పరిచయంతప్ప జ్ఞానం తెలిశాక అతనితో ఎక్కువ సాన్నిహిత్యం లేని సుమతి ఆనంద్ తనని పెళ్ళి చేసుకుంటానని అన్నప్పుడు ఆశ్చర్యపడింది. జీవితంలో ఓ ఉద్దేశమంటూ ఏర్ప రుచుకోని సుమతి ఆ వివాహానికి అంగీకరించింది. ఆనంద్‌కి టీచర్‌గా జాబ్ దొరకడమే తడవుగా ఇల్లు చూసివచ్చి సుమతిని తీసికెళ్ళాడు.

*

"సుమా!" గట్టిగా కేక వేశాడు ఆనంద్.

"వస్తున్నా! కాస్తాగండి!" అంటూనే చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

"చూడు! ఈ టేబుల్ ఎంత అధ్వానంగా తయారయిందో? దీని మీద కుంకుమభరిణ పెట్టి అలాగే వెళ్ళావ్! ఓ చెత్తదుకాణంలా వుందీ టేబుల్!" మందలింపుగా అన్నాడు ఆనంద్.

కుంకుమభరిణి బోర్లాపడి టేబుల్‌క్లాతంతా కుంకుమతో నిండిపోయింది.

"ఏ వస్తువు ఎక్కడ పెట్టాలో తెలియకపోతే ఎలా?" సణుక్కుంటూ చెప్పులు తొడుక్కుంటు న్నాడు ఆనంద్. సుమతికి ఉక్రోషం ముంచు కొచ్చింది: "అవును! నాకు నాల్గుచేతులు లేవు! పెందరాళే ఇంటిపని, వంటపని... ఒక్కదాన్ని... ఏవస్తువు ఎక్కడ పెట్టాలి అనే విషయం నాకెలా తెలుస్తుంది? చేస్తున్న పనులకు గుర్తింపు లేకపోగా ఈ విసుర్లు!" ఆమె గొంతు గద్గదమయింది. "చేసి పెడుతుంటే హాయిగా తిని పోయేవాళ్ళకేం తెలుస్తుంది నా బాధ" విసురుగా అన్నది.

"ఏమిటీ! నువ్వు వండిపెడుతుంటే హాయిగా తింటున్నానా! నేను సంపాదించి తీసుకురాకపోతే నువ్వెక్కడ్నించి వండిపెడతావ్!" వెటకారంగా అన్నాడు అతను.

"ఓయబ్బో! అంతోటి ఉద్యోగం నేనూ చేయగలను. మీరు వండిపెడతారా?" పౌరుషంగా అన్నది ఆమె.

ఆనంద్‌కి ఒళ్ళుమండిపోయింది. "నోర్ముయ్! ఏంటా తలపొగరు సమాధానం! ఎవరన్నా వింటే నవ్వుతారు. ఛ! ఛ! చదువుకుందీ! ఎందుకు?" చీత్కరిస్తూ వెళ్ళిపోయాడు.

సుమతికి దుఃఖం పొంగుకొచ్చింది. బావురు మంటూ వంటింట్లోకి పరిగెత్తింది. అన్నం పొంగు తున్నది. కంగారుగా మూతతీయబోయి ఊరుకుంది. "ఛ! నన్ను లెక్కచేయనివాడికి నేనెందుకు వండాలి?" అనుకుంది ఆమె.

"అతనొక్కడే తింటున్నాడా?" ఎదురు ప్రశ్న వేసింది అంతరాత్మ.

"ఈపాటి తిండి ఎవరిదగ్గర పని చేసినా పెడతారు!"

"మరి చేస్తే ఏం?" అంతరాత్మ ప్రశ్నకు తడబడింది. "అవును! చేస్తే.... ఛీ! ఎంత అవమానం!"

"ఆఁ అందుకే ఇక్కడే ఇతని నీడన వుండి వండి పెడుతున్నందుకు నీకు సంఘంలో 'మంచి గృహిణి' అని పేరు వస్తుంది!" బోధించింది అంతరాత్మ.

"నాకా బిరుదు అక్కర్లేదు! నన్ను మనిషిగా చూసే మనసు వుంటే చాలు!" ఏడుస్తూ అను కుంది సుమతి. ఎలాగో వంట అయిందనిపించి పెరట్లో కూచుంది.

ఆనంద్ స్కూల్లో పాఠం చెపుతున్నాడన్న మాటేగాని మనసులో మథనపడుతూనే వున్నాడు. 'ఛ! అనవసరంగా మాటలు పెంచాడు తను. పాపం! ఇంటిపనులు చేసుకునేసరికే పొద్దు పోతుంది. ఇక వస్తువులు సర్దటానికి అంత ప్రొద్దున్నే తీరిక ఎక్కడుంటుంది? 9 గంటలకే తను వెళ్ళాలాయె. చీకట్లో లేచి బొట్టు దిద్దుకొని పనితొందరలో అక్కడ పెట్టి మరిచిపోయి వుంటుంది. ఒలకబోయటం తన తప్పుకాదూ! పాపం! సుమతి ఎంత బాధపడుతున్నదో?' అను కుంటూ క్లాసు మధ్యలోనే లేచి వచ్చేశాడు. ఇంట్లోకి వెళ్ళేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. అదో ఇదో సర్దుతూవుండే సుమ ఏదీ అనుకుని పెరటివైపు నడిచాడు అతను.

శూన్యంలోకి చూస్తూంది సుమతి. 'తమ కాపురం గురించి ఎన్నికలలు కన్నది తాను! ఇద్దరి మధ్యా పొరపొచ్చాలు రాకుండా అన్యోన్యంగా వుండాలను కుంది. తనేం పెద్ద కోరికలు కోరలేదే! ఎంత ఇల్లైనాసరే ఆఖరికి ఒక్కగదిలోనైనా అతనికి అను గుణంగా వుంటాననుకుంది. ప్రొద్దున అంత చిన్న విషయానికే నోర్ముయ్ అని అనటానికి అతనికి నోరెలా వచ్చింది. ఎంతైనా తన చేతిక్రింద వున్న దాన్ననేగా ఆ ధీమా! ఛీ! ఆడదాని బ్రతుకు ఎప్పుడూ బానిస బ్రతుకే!' అప్రయత్నంగా ఆమె కళ్ళనుండి నీళ్ళు బుగ్గల మీదుగా జారిపోసాగాయి.

ఆనంద్ వెనకనుండి వంగి ఆమె భుజాలమీద చేతులువేసి "సుమా!" అన్నాడు ఆప్యాయంగా. సుమతి ఉలికిపడి తడబాటుగా కళ్ళు తుడుచుకొని లేచి నిలుచుంది.

"ఏంటి సుమతీ! ఏడుస్తున్నావా?" కంగా రుగా అన్నాడు. పారిపోతున్న ఆమె దుఃఖం తిరిగి పరిగెత్తుకొచ్చింది.

"ఛ! ఛ! ఇంత చిన్నవిషయానికే ఏడు స్తారా? ఇంకెప్పుడూ అలా అనను గా!" అని ఆమెను దగ్గరకు తీసుకొని అనునయించసాగాడు.

"సుమా! నాకు బ్రహ్మాండంగా ఆకలేస్తుంది! అన్నం పెట్టవా?"

ఉదయం ఏమీ తినిపోలేదని గుర్తుకువచ్చి సుమతి గబగబా వెళ్ళి అన్నం వడ్డించింది.

"నా ఒక్కనికే వడ్డించావేం? నువ్వు తినవా?" ఆశ్చర్యంగా అడిగాడు అతను. సుమతి మాట్లాడ లేదు. "ఇంకా కోపం పోలేదన్నమాట! సరే!" అంటూ పళ్ళెం తీసుకొని ఆమె ముందు కూచుని "ఏదీ నోరు తెరు!" అన్నాడు చిలిపిగా. సుమతి బుగ్గలు ఎర్రబారాయి. ముఖం ప్రక్కకి తిప్పుకుంది. "ఉహుఁ నేను వూరుకునేదిలేదు." అని ఓ చేత్తో ఆమె తలను పట్టుకొని చిన్నపాపకు తినిపించినట్లు తినిపించాడు.-"మరి నువ్వు తిన్నావు నాకు తినిపించవూ?" అన్నాడు.

సుమతి సిగ్గుపడింది. అప్పటిదాకా వున్న ఉక్రోషం, ఆవేదనా అతని ఆప్యాయతలో మంచులా కరిగిపోయాయి.

"నాకు ఆకలి బాగా వేస్తుంది. నువ్వు పెడితే కాని నేను తినను!" పట్టుదలగా అన్నాడు. సుమతి గబుక్కున అన్నంముద్ద తీసి భర్త నోటికందిం చింది. అమె చేయినలాగే పట్టుకొని అన్నం ముద్దతోసహా తనకేసి లాక్కున్నాడు ఆనంద్.

"సుమా! పనిమనిషిని పెట్టిస్తానంటే వినవు కదా! ఇప్పుడుచూడు పనికి ఎంత అలసిపోతు న్నావో?" ఆప్యాయంగా అన్నాడు ఆనంద్.

తోమిన గిన్నెల్ని కడుగుతూ, "మనకు దేవు డిచ్చిన చేతులు వుండగా ఇంకొకరి అవసర మెందుకు? ఐనా మన పని మనం చేసుకుంటేనే తృప్తి! పైగా పొదుపుకూడా!" అన్నది ఆమె.

నిజంగా అటువంటి భార్య దొరకటం తన అదృష్టం అనుకున్నాడు ఆనంద్.

"ఏమండీ! కాస్త కూరకాయలు పట్టు కొస్తారూ! ఇవాళ వండటానికి లేవు!" కేక వేసింది సుమతి.

ఆనంద్ చిరాకుపడి "అయిపోగానే తెప్పిం చుకోవద్దూ? ప్రొద్దున్నే చెప్పినా బావుండేది. ఒక్కరోజు కూర లేకపోతే ఏం గడవదా! ఎలాగో సర్దుకోవచ్చులే!" అని హడావుడిగా వెళ్ళిపోయేడు.

సుమతి నిస్పృహగా కూలబడింది. కూర కాయల్లేకుండా ఎలా? పచ్చళ్ళుకూడా ఐపోయాయి. కాస్త ఆలోచించి పక్కింటి పిల్లవానితో బజారు నుండి వంకాయలు తెప్పించి వండింది.

భోజనాల దగ్గర — "సుమతీ! నిజంగా నీ పట్టు నీదేకదా! కూర వద్దులే అంటే వండావ్. వద్దన్నపని చేసి తీరాలంటావు. నిన్ను మార్చడం నాతరం కాదు." నిస్పృహగా అన్నాడు.

"నేనేమీ చెడ్డపనులు చేయలేదులెండి మార్చ టానికి" హాస్యంగా అన్నది సుమతి.

"నేనింత సీరియస్‌గా అంటుంటే నీకు హాస్యంగా ఉందా?"

సుమతి విసురుగా అన్నది: "ఇందులో సీరి యస్‌గా తీసుకోవాల్సిందేముంది?"

"అదే! ఆ ఎదిరించటం! నువ్వా ఎదురు మాట చెప్పటం మానుకోవాలి!" మందలించాడు అతను.

"ఊహుఁ....దూ దూ బసవన్నా అంటూ మీరన్నదానికి తల వూపుతూ చెప్పు కింది తేలులా అణగి వుండాలంటారా?" రోషంతో సుమతి ముక్కుపుటాలు అదిరాయి.

"నే నలా అన్నానా? వూరికే ఎందుకలా నోరు పారేసుకుంటావ్!" గద్దించాడు ఆనంద్.

"మరేఁ? నేనే నోరు పారేసుకుంటున్నాను; మీరు ఏమీ అనందే నే నెందుకంటాను?"

"సుమతీ! ఇంకా ఎందుకు పొడిగిస్తావ్! నా కసలే కోపం వచ్చిందంటే...."

మధ్యలోనే అందుకొన్నది ఆమె: "వస్తే! ఏం చేస్తారు? తల తీసి మొలకేస్తారా? మీకున్నదీ—మీ మగవాళ్ళు గర్వపడేదీ ఆ బలం చూసేగా? కొడ తారా? కొట్టండి!" ఆమె మాటలు విసురుగా దూసుకు వచ్చాయి.

"ఛీ! అన్నం ముందుపెట్టి ఇన్ని అంటుంటే తినాలనా, వద్దనా నీ ఉద్దేశం?" సూటిగా అడిగాడు అతను.

## వనిత మాటల కొలువు-9

సరైన సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 జ | ల | 11 జ | 12 స | యు | 13 న | ■ | ■ |
| న | ■ | 2 గ | వ | ■ | 3 ల | గ్గ | 14 ము |
| 4 త | 15 గ | డ | ల | ■ | ము | ■ | ఖ |
| ■ | 5 వా | ము | ■ | 6 ము | హూ | ర్త | ము |
| 7 ర | క్ష | ■ | 16 దే | ■ | రా | ■ | ■ |
| ■ | 8 ము | 17 దు | రు | ■ | 9 జు | 18 గు | ప్స |
| 19 వా | ■ | రు | ■ | 20 వే | ■ | హు | ■ |
| కు | ■ | సు | ■ | 10 ట | వి | డు | పు |

పై సమాధానంతో సరిపోయే సమాధానాలు పంపినవారు నలుగురు. వారు:

ఎం. వి. లక్ష్మి
గుంటూరు

ఎస్. కుమారి
బాపట్ల

జమ్మలమడక సీతాశర్మ
గుంటూరు

కె. ఆర్. విజయ
బాపట్ల

బహుమతి మొత్తం 116 రూ. లను ఈ నలుగురికీ సమానంగా పంచి అందజేస్తున్నాము.

"మీతోపాటు నేనూ కూడా తింటున్నాను. మీ ఉద్దేశమేమిటి?" ఎదురు ప్రశ్న వేసింది ఆమె.

"ఛీ! ఛీ! మాటకు మాట! మాటలునేర్చిన కుక్క ఉస్కో అంటే ఉస్కోమందంట!" ఆవేశంగా అన్నాడు ఆనంద్.

"అనండి! ఎన్ని అన్నా మీ పంచనపడి వుండేదాన్ని కాబట్టి కుక్కన్నా, గాడిదన్నా పడా ల్సిందే! పెద్ద కోరి కోరి చేసుకున్నాడు పెళ్ళి! అంతా నా ఖర్మ!" సుమతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆమెతో ఇహ వాదించలేక విసురుగా లేచి వెళ్ళిపోయాడు ఆనంద్.


కలిపిన అన్నం వెక్కిరిస్తుంటే వెక్కి వెక్కి ఏడిచింది సుమతి.

*

సుమతి తిరిగ్గా కూచుని—ఇంత ప్రేమగా ఇద్దరూ వుంటున్నా కూడా ఈ కలహాలు రావటానికి కారణ మేమిటా అని ఆలోచించింది. ఆ రోజు జరిగిన సంఘటనలో ఎక్కువగా తన పొరపాటు తెలి సింది. 'నిజమే! తను అనవసరంగా పొడిగించింది. ఛ! ఆనంద్ అన్నం ముందు నుంచి లేచి పోయేడు. ఎక్కడికెళ్ళారో? ఆమె గుండె దడదడలాడింది. తన మీద విరక్తి పుట్టలేదు కదా! అమ్మో! ఆనంద్‌ని వదిలి తను బ్రతుకగలదా?' ఒక్కొక్క నిమిషం గడుస్తున్నకొద్దీ సుమతికి ఆరాటం పెరగసాగింది. వద్దంటున్నా ఆమె మనసు కీడును శంకించింది. వాకిట్లోనే నిలబడి వీధివైపు చూడసాగింది.

ఆనంద్ వూరి చివరనున్న చెరువుదగ్గర కూచుని ఒక్కొక్క రాయే నీళ్ళలోకి విసురుతూ ఆలోచించసాగాడు. 'సుమతికీ, తనకూ ఎందు కిలా పోట్లాటలొస్తున్నాయి? తను ఆమెను అర్థం చేసుకోలేకనా! గృహిణి తన ఇంట్లో తన ఇష్టం వచ్చిన వంటకాలు చేస్తుంది. వంటల దగ్గర్నుంచీ భర్త అభిప్రాయమే నడవాలంటే ఎలా? ఆమె తృప్తి ఆమెది. కష్టపడి వండినందుకు ఆమెకు అదా బహుమతి! ఛీ! మొదటి నుంచీ ప్రతి మగవానిలోనూ వుండే తత్త్వమే తనలోనూ గూడు కట్టుకుంది. అనాదిగా వస్తున్న ఈ అధికార తత్త్వం ఎంత మానుకుందామన్నా మానదు. ఇంటి దగ్గర సుమతి ఏం చేస్తుందో? అసలే ఆత్మాభిమానం ఎక్కువ. ఏదైనా అఘాయిత్యం చేయదు కదా!' అప్పటివరకూ పరిపరివిధాల

ఆలోచిస్తున్న ఆనంద్ ఈ ఊహ రాగానే ఆత్రుతగాలేచి నడవ సాగేడు. గుమ్మంలోకి అడుగుపెట్టగానే ఆశ్చర్యపోయేడు. ఏడ్చి, ఏడ్చి ఉబ్బిన కళ్ళు, చెదరిన తల, అదురుతున్న పెదవులతో సుమతి తనకోరకే ఎదురు చూస్తుంది అనుకోగానే అతని హృదయం ఆనందంతో ఉరకలు వేసింది. "వచ్చారా?" సంతోషంగా సంబరంగా ఎదురెళ్ళింది సుమతి. "సుమా! నా సుమా!" ఆమెను హృదయానికి హత్తుకుంటూ పరవశంగా అనుకున్నాడు ఆనంద్.




*

"సుమతీ! రెండు కాఫీలు కావాలి! త్వరగా పెట్టు" వంటింట్లోకి వచ్చినంత తొందరగా వెళ్ళి పోయేడు ఆనంద్.

సుమతికి కోపమొచ్చింది. వేళకాని వేళలో కాఫీ చేయాలంటే పాలెక్కడ్నుంచి వస్తాయి? ఎవరితోనన్నా చెబుతామన్నా హాలులో నుండే పోవాలి. ఈ సంగతి ఆనంద్‌కి ఎలాగో చెప్పాలనుకొని గదిలోకి వచ్చింది.

అవతల హాలులో "ఆనంద్! మేము వెళ్ళొస్తాం!" ఎవరిదో కంఠం.

"కాసేపాగండి! కాఫీ తీసుకొని వెళ్దురుగాని!" ఆనంద్ కంఠం.

"కాఫీయా! ఈ వేళప్పుడు కాఫీ ఏమిటండీ?" మొహమాటపడుతూనే కూచున్నారు మళ్ళీ సంభాషణను పొడిగించుతూ!

కర్టెన్‌చాటున సుమతి నుదురుకొట్టుకొని దీర్ఘంగా నిట్టూర్చింది. మళ్ళీ ఏదో గుర్తుకురాగా గబగబ వెళ్ళి పాలపౌడర్ డబ్బా మూత తీసి చూసింది. అందులో కొద్దిగా పౌడర్ వుంది. 'హమ్మయ్య' అనుకుని తొందరగా పాలు కలిపి కాఫీ చేసి మూడు కప్పుల్లో నింపింది.

"ఇంతలేటా? ఎంతసేపని కూచుంటారు వాళ్ళు!" విసుగ్గా అని కాఫీలు పట్టుకొని హాలులోకి వెళ్ళాడు ఆనంద్. సుమతిలో ఉక్రోషమూ, దుఃఖమూ పోటీ పడ్డాయి. తను కాబట్టి ఆ మాత్రమైనా చేసింది. ఇంకొకరయితే అసలు చేసేవారేకాదు!

"ఛీ! ఛీ! ఇంతటి దానివని అనుకోలేదు! చేయడం ఇష్టం లేకపోతే మానేయొచ్చుగా!" కోపంగా వంటింట్లోకివస్తూ అన్నాడు ఆనంద్.

సుమతి అర్థంకానట్టు చూసింది. "ఎందుకలా చూస్తావ్? విషంలాంటి కాఫీ త్రాగటానికి రాలేదు వాళ్ళు" విసురుగా అన్నాడు.

సుమతికి అర్థమయింది — పాలు సరిపోలేదు కాబోలు.

"మన ఇంట్లో చేసుకునేదీ ఎవరు చూస్తారు? కనీసం బైటివాళ్ళకయినా మంచిగా చేయాలి .... ఛ! మాట మీద విలువేలేదు. ఎంతవాగినా చెవిటి దాని ముందు శంఖమూదినట్లే" చీత్కారంగా అన్నాడు ఆదంద్.

సుమతి అభిమానం దెబ్బతినగా పాములా తల ఎత్తింది. "చేసినపనిని సమర్థించుకుంటే ఎదురు మాట్లాడాననీ, ఊరుకుంటే చెవిటిదనీ! అంటారు. ఎలా చావాలి మీతో? అంత దృష్టి వున్నవారైతే ఇంట్లో పాలు వున్నవోలేవో అడగక్కర్లేదా? అవతల మీ మెహర్బానీ కోసం కాఫీలు ఇస్తామని చెపుతారు – లోపల పాలు లేక ఎంత కష్టపడ్డానో మీకేం తెల్సు!" రోషంగా అన్నది ఆమె.

ఆనంద్ అవాక్కయాడు. ఇంట్లో పాలులేవా! తన తొందరపాటుకి నొచ్చుకున్నాడు.

ఐనా సుమతి ముందు అలా ఓటమిని అంగీకరించడం తల కొట్టేసినంత పని అన్పించి "మొదలే ఆ ఏడుపు ఏడిస్తే వుండమనకపోదును కదా?" అన్నాడు వెటకారంగా.

దెబ్బ తిన్న పులిలా చూసింది సుమతి. పరిస్థితిని గ్రహించి కూడా అతడు తన తప్పును సమర్థించుకొని తనని ఎద్దేవాచేయటం భరించలేక పోయింది: "ఏమండీ! ఎన్నన్నా ఊరుకుంటున్నానని మాటలు మిగలకండి! నాకూ మనస్సూ, అభిమానమూ వున్నాయి!" తీక్షణంగా అన్నది.

ఆ మాటలు విని ఆనంద్ ఉడికి పోయాడు. "అలాగా! ఇన్నాళ్ళనుండి లేవనుకున్నాను.... అనవసరంగా మాటలతో రెచ్చగొట్టి నాకు కోపం తెప్పించకు!" అన్నాడు.

"మాటలంటుంటే మీకే కోపం వస్తుంది కాని నాకు రాదా! నేను ఆడదాన్ని కాబట్టి కోపం రాకూడదని రూలుందా ఏదైనా! మీరూ నన్ను రెచ్చగొట్టకండి!" అతని వాక్యాన్ని అతనికే తిప్పికొట్టింది సుమతి.

"ఊరుకుంటుంటే మితిమీరుతున్నావ్! ఎక్కడుంచేవాళ్ళని అక్కడే వుంచాలి. కాళ్ళకి వుండే చెప్పుల్ని నెత్తికెక్కించుకున్నట్లుగా వుంది నీ ధోరణి చూస్తుంటే...."

సుమతి ముఖంలోకి రక్తం పొంగు కొచ్చింది: "అంటే మీ ఉద్దేశం – నేను కాలిచెప్పుననా! మీకూ, నాకూ దేంట్లో తేడావుందో చెప్పండి. శరీర తత్వాల్లో సహజం ఆ తేడాలు. అంత మాత్రాన ఆడది మగవానికి లొంగివుండాలా? చేతకాని మగవాళ్ళుచేసే బలహీనపు వాదమిది!"

ఆనంద్ ఇహ సహించలేకపోయాడు. సుమతి చెంప చెళ్ళుమంది.

ఆమె తెల్లబోయింది. ఆమె కళ్ళల్లో నీరూ, పౌరుషమూ, అభిమానమూ పోటీ పడ్డాయి.

సుమతి నిశ్చలంగా చూస్తూ అన్నది: "ఇదే దెబ్బ నేను తిరిగి స్తే మీ పరువు ఎక్కడుంటుందో వూహించండి! ఒకటి మాత్రం గుర్తుంచుకోండి—ప్రేమగల వస్తువును ఎవరూ చేజేతులా ముక్కలుచేసుకోరు. ఆడవారు మగవాళ్ళని మనసారా ప్రేమిస్తారు. కాబట్టే మళ్ళీ ఎదురు దెబ్బ వేయాలంటే సంకోచిస్తారు. ఆ అలుసు చూసుకొని మీ మగవాళ్ళు పేట్రేగిపోతున్నారు. నా దృష్టిలో భార్యను కొట్టే మగవాడు బలహీనమైన వ్యక్తిత్వమున్నవాడు. ఇంతవిలువ తగ్గాక, ఇంత వరకూ వచ్చాక – నేనూ, మీరూ కలని వుండటం జరగనిపని! మీ భావాలకు అనుగుణంగా మీ చెప్పు కింది తేలులావుండే ఆవిడ్ని తెచ్చుకోండి!"

విసురుగా గదిలోకిపోయి బట్టలు సర్దుకోసాగింది సుమతి. అనుకోని ఆ సంఘటనకు ఆనంద్ నిర్ఘాంతపోయాడు. ఆమె ప్రయాణాన్ని ఆపడానికి ఆత్మాభిమానం అడ్డువచ్చింది. 'ఆడదానికే అంత తలపొగరైతే తన కెంత వుండాలి. ఇన్ని మాటలన్న ఆమెను ఆపి బావుకునేదేముంది?' ఆ వూహరాగానే బిర్ర బిగుసుకు పోయాడు అతను.

అతని ముందు నుంచే సూట్‌కేస్ పట్టుకొని మెట్లుదిగుతూ "చూడండి! నేను మళ్ళీ ఈ ఇంటికి రావటం కల్ల! ఒకవేళ మీరు నన్ను గురించి వస్తే చెప్పలేను కాని – నేను మాత్రం మీ అండ లేకుండా బ్రతకలేననుకోవడం మీ పొరపాటు. నేనూ చదువుకున్నాను .... ఉద్యోగం చేస్తాను. మీరు మరో పెళ్ళి చేసుకోవచ్చు కాని వచ్చే ఆవిడా స్త్రీయేకదా! అందుకే మీకో విషయం చెప్పాలనుకుంటున్నా! ఆడది కేవలం మీ సుఖ సంతోషాల కోసం రాత్రింబవళ్ళు శ్రమించి, మీకు వండిపెడుతూ ఉండే యంత్రం కాదు. ఆడది కోరుకునేవి – ప్రేమ, అనురాగం, స్వేచ్ఛ, సమానత్వం! ఇంట్లో ఒక్కతే కష్టపడేబదులు భర్తా ఓ చేయికలిపితే ఎంతో ఆనందిస్తుంది. ఆడదానికీ, మనసూ, ఆత్మాభిమానమూ వున్నాయని గ్రహిస్తే మంచిది! గుడ్‌బై!" అని గబగబా మెట్లు దిగిపోయింది సుమతి.

ఆమె గుండెలు ఎగసి పడుతున్నాయి. ఎంతగా అతన్ని ప్రేమించింది? 'తన మనసూ, శరీరమూ అర్పించినందుకు ప్రతిఫలమిదా! కేవలం ఒక్క చిన్న పొరపాటుకు....హుఁ. ఆ పొరపాటైనా తనది కాదు' ఉక్రోషంగా అనుకుంది ఆమె. 'ప్రతి చోటా స్త్రీ ఇలాగే మోసపోతున్నది! తమని విడిచి స్త్రీలు బ్రతుకలేరనేగా మగవారి ధీమా! ఆడదేలే ఏం చేస్తుంది? అనే చులకనభావం ఈ మగవారి నరనరాల్లో పాతుకుపోయాయి. ఇంకా ఎన్నాళ్ళకి స్త్రీకి గుర్తింపు వస్తుందో? అన్ని రంగాలలోను స్త్రీలకు స్థానమిస్తున్నారు కాని అందుకు ఎంతమంది భర్తలు మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నారు? ఎంతమంది సంసారాలు కలత లేకుండా వున్నాయి? ఇవన్నీ జవాబులు లేని ప్రశ్నలే అవుతాయి. పైకి కనబడేదే నిజం! ఆవిడ ఉపన్యసిస్తుంటే అందరూ ఆహాఁ ఓహో అని మెచ్చుకుంటుంటే ఆమె భర్త కూడా మనస్ఫూర్తిగా మెచ్చుకుంటాడా? పైకి మాత్రం అలా కనిపిస్తాడు. ఇంటికెళ్ళాక ఎన్ని మాటలు విసురుతాడో ఎవరికి తెలుస్తుంది? అందరికీ కనిపించేది మాత్రం భార్య లెక్చరుకు భర్త చప్పట్లుకొట్టడం!' అనుకుంది ఆమె.

ఎదురుగా బండి రావడంతో సుమతి ఆలోచనలకు అంతరాయం కల్గింది. బస్ టైమవుతున్నది అనుకుని గబగబా నడవసాగింది.

సుమతి వెళ్ళిపోయాక ఆనంద్ అలసటగా ఓ కుర్చీలో కూలబడ్డాడు. 'ఎంతపని చేసింది సుమతి? ఇది తన తప్పు కానేకాదు. ఆమె మాటకు మాట జవాబివ్వకపోతే ఇంత రభస జరిగి వుండేది కాదు' అనుకుని తనని తాను సమర్థించుకున్నాడు అతను.

'నీ తప్పు లేదూ ఇందులో?' అతని అంతరాత్మ నిలదీసింది. ఆనంద్ బిత్తరపోయాడు.

"పాలు వున్నవో లేవో తెల్సుకోకుండా కాఫీ చేయంటే ఆవిడేమన్నా దేవతా పాలు లేకుండా కాఫీలు చేయడానికి!"

'పాలు లేవని చెప్పొచ్చుగా?' ఆనంద్ ఎదురు ప్రశ్న వేశాడు.

'నీవు చెప్పేంత టైమిచ్చావా? నీ హృదయం మీద చేయి వేసుకుని జవాబుచెప్పు!' గద్దించింది అంతరాత్మ. ఆనంద్ తగ్గాడు. అవును! నిజమే! తను తొందరగా వెళ్ళిపోయేడు. తప్పు ఒప్పుకున్నాడు. అంతరాత్మ విజయాట్టహాసం చేసింది: 'అసలు పరిస్థితి తెలిసిన తర్వాత కూడా ఆమె ముందు తగ్గిపోలేక మాటలు పెంచావు. అనవసరంగా మాటలు, దెబ్బలు పడటానికి ఆవిడ నోరులేని జంతువుకాదు. సుమతి అసలే అభిమానమున్న స్త్రీ! ఈ వూరి పొలిమేర దాటాక ఇహ రావటం కల్ల! వెళ్ళు! ఊఁ. సుమతిని తీసుకురా! వెళ్ళు! వెళ్ళు!!' అంతరాత్మ హెచ్చరికతో నిద్రలోంచి లేచినట్లు గబుక్కున లేచి గబగబ వీధిలోకి నడిచాడు.

సుమతి బస్‌లో కూచుంది. 'తనేమన్నా తప్పు చేస్తున్నదా! ప్రేమించే భర్తను వదిలి అనవసరంగా తన జీవితాన్ని చిక్కుల్లో దింపుకుంటున్నదా? తన నతడు ప్రేమిస్తే తను వస్తుంటే ఆపలేదేం? తనకు అతనిమీద ప్రేమ వుండగానే సరా? అతనికి తనమీద వుండొద్దూ! పోతే ఇన్ని రోజుల అతని ప్రేమంతా నటనా?' ఇహ ఆలోచించలేకపోయింది ఆమె. అన్యమనస్కంగా వున్న సుమతి "సుమా!" అని దగ్గరగా వినిపించిన కంఠానికి ఉలిక్కిపడింది. 'ఆనంద్!' సుమతి మనసు ఆనందంగా పొంగిపోయింది.

"సుమా! ఆవేశంలో చేయి చేసుకున్నాను! నన్ను క్షమించు!"

సుమతి అటూఇటూ చూసి అతని నోరుమూసి "అంతమాటనకండీ" అన్నది.

ఆ చేయిని అలాగే పట్టుకొని "రా, సుమా! బస్సుదిగు!" సూట్‌కేస్ అందుకున్నాడు.

సుమతి మంత్ర ముగ్ధలా అతని వెంట నడిచింది.

"ఏమిటండీ మాస్టారూ! దిగిపోతున్నారు!" ఎదురుగా వున్న అతను ప్రశ్నించాడు.

"అహఁ, ఏం లేదండీ? ఒంట్లో బావు లేదట!" అని సంజాయిషీ చెప్పి సుమతివైపు చూసి నవ్వాడు ఆనంద్.

"సుమా! ఇంకోసారి ఇలా జరగకుండా వుండాలంటే ఏం చేయాలి?" అమాయకంగా అడిగాడు ఆనంద్.

సుమతి అతని షర్టు గుండీలు విప్పి మళ్ళా పెడుతూ "స్త్రీకి కావల్సింది గుర్తింపండీ! కేవలం పనిమనిషిగా చూసే భర్తని–తనకి లొంగి వుండాలి అనే ఆలోచన వున్న మగవాణ్ణి స్త్రీ ప్రేమించలేదు. విధిలేక పైకి ప్రేమ వున్నట్లు నటిస్తుంది. తనని ఓ మనిషిగా గుర్తించిన నాడే స్త్రీ సంతోషిస్తుంది. ఆ కాపురంలో కీచులాటలు వుండవు!" అన్నది.

"నిన్నెలా గుర్తించాలో నాకు అర్థంకావటం లేదు. నా మనసునడుగు" అంటూ సుమతిని తన గుండెకు హత్తుకున్నాడు ఆనంద్. *